క్లుప్తంగా

నేడు వడ్డాదిలో నీలకంఠేశ్వరస్వామి కల్యాణం


నీలకంఠేశ్వరస్వామి

బుచ్చెయ్యపేట: వడ్డాది మేజర్ పంచాయతీలో వెలిసిన ఉమాగౌరీ నీలకంఠేశ్వరస్వామి వార్షిక కల్యాణోత్సవం సోమవారం ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు దొంతుకుర్తి శ్రీనివాసవర్మ, సోమేష్‌కుమార్ తెలిపారు. పురాతన కాలం నాటి శివాలయంలో స్వామివారి కల్యాణాన్ని ఏటా ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. రాత్రి ఏడున్నర గంటలకు ఇక్కడ మండపంలో నిర్వహించే కల్యాణ వేడుకల్లో భక్తులు పాల్గొని కనులారా వీక్షించి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ఈవో శర్మ, ఆలయ సిబ్బంది కోరారు.

విస్తారంగా మిరప సాగు


గవరపాలెంలో మిరప పంట

కె.కోటపాడు: మండలంలోని పలు గ్రామాల్లో మిరప పంట విస్తారంగా సాగవుతోంది. ప్రధానంగా సాగు నీటి వసతి కలిగిన పొలాల్లో ఈ పంట వేశారు. పంటకు ప్రతీ పది రోజులకు నీటి తడుపు అందించడం వల్ల మొక్క నాటిన 45 రోజులకు పంట కోత దశ ప్రారంభమవుతుంది. తక్కువ పెట్టుబడితో రెండు నెలల్లోనే మంచి దిగుబడి సాధించవచ్చు. ఇటీవల అడపాదడపా కురుస్తున్న వర్షాలు పంటకు మేలు చేశాయని రైతులు చెబుతున్నారు. మండలంలో సింగన్నదొరపాలెం, పిండ్రంగి, గవరపాలెం, డి.అగ్రహారం, లంకవానిపాలెం, మర్రివలస, శృంగవరం, పాతవలస, కె.కె.అగ్రహారం, కె.సంతపాలెం గ్రామాల్లోని 140 ఎకరాల్లో మిరప సాగు చేస్తున్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు


పశువులకు టీకాలు వేస్తున్న సిబ్బంది

మాడుగుల రూరల్: వర్షాకాలంలో పశువులకు గాలికుంటు రాకుండా టీకాలు వేస్తున్నామని మాడుగుల ఏరియా పశువైద్య సహాయ సంచాలకుడు వి. చిట్టినాయుడు ఆదివారం తెలిపారు. ఈ నెల ఒకటి నుంచి 30వ తేదీ వరకు ఈ టీకాలు వేయడానికి కార్యాచరణ రూపొందించామన్నారు. ఇంతవరకు 828 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశామన్నారు. ప్రతి రైతు పశువులకు వేయించాలని సూచించారు.

చోడవరం ఎమ్మెల్యేను కలిసిన రేషన్ డీలర్లు


చోడవరం ఎమ్మెల్యే రాజుతో రేషన్ డీలర్లు

రోలుగుంట: మండలంలోని రేషన్ డీలర్లందరూ టీడీపీ ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్. రాజును ఆదివారం చోడవరంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనకు శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందించి సత్కరించారు. పాత పద్ధతిలోనే రేషన్ అమలు చేయించాలని కోరారు. ప్రభుత్వం నిర్ణయించిన తేదీల్లో రేషన్ సరుకులు అందిస్తామని, సమయ పాలనతో విధులు నిర్వహిస్తామని విన్నవించుకున్నారు. దీనిపై ఎమ్మెల్యే స్పందించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారని డీలర్ల సంఘం మండల నాయకులు గొల్లు నాయుడు, ముత్యాల పోతురాజు, మోటమర్ల రామకృష్ణ, బంటు శ్రీను, మల్లా శ్రీను తెలిపారు.

ఘనంగా మోదకొండమ్మ పండగ

మాడుగుల: గాదిరాయిలో ఆదివారం మోదకొండమ్మ పండగ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన నేల వేషాలు, విద్యుత్ లైటింగ్ ప్రజలను ఆకట్టుకున్నాయి. తెల్లవారు నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

సిద్ధమైన పశువుల ఆస్పత్రి

- వడ్డాదిలో త్వరలో ప్రారంభం
- రూ.10 లక్షలతో నిర్మించిన విశాఖ డెయిరీ
- 15 గ్రామాలకు అందనున్న వైద్య సేవలు
- పాడి రైతుల ఆనందం


ప్రస్తుతం శిథిలావస్థలో నడుస్తున్న పశువుల ఆస్పత్రి


వడ్డాదిలో ప్రారంభానికి సిద్ధమైన పశువుల ఆస్పత్రి

బుచ్చెయ్యపేట: పాడి రైతుల సంక్షేమం కోసం విశాఖ డెయిరీ కృషి ఎనలేనిది. ఇప్పటికే పాడి రంగంలో వారికి రాయితీలపై అనేక ప్రయోజనాలు కల్పిస్తున్న ఆ సంస్థ పలు అభివృద్ధి పనులు చేస్తోంది. ఇందులో భాగంగా వడ్డాదిలో రూ.10 లక్షలతో నిర్మించిన పశువుల ఆస్పత్రి ప్రారంభోత్సవానికి సిద్ధమైంది.
వడ్డాది మేజర్ పంచాయతీలోని పశువుల ఆస్పత్రి పరిధిలో 15 గ్రామాల పాడి పశువులు, ఇతర జీవాలకు పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి. వడ్డాది, బంగారుమెట్ట, ఎల్బీపురం, లోపూడి, శింగవరం, పీడీ పాలెం, చిన అప్పనపాలెం, పి.భీమవరం, కుముదాంపేట, విజయరామరాజుపేట, మంగళాపురం, మాడుగుల మండలం వీరవల్లి, పోతనపూడి తదితర గ్రామాల రైతులకు చెందిన ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలు, నాటు కోళ్లు, పందులు ఇతర జీవాలకు వడ్డాది ఆస్పత్రి ద్వారానే వైద్య సేవలందుతున్నాయి. 30 ఏళ్ల క్రితం ఇక్కడ పెద్దేరు నది పక్కన అప్పటి దాతలు ఇచ్చిన స్థలంలో నిర్మించిన పశువుల ఆస్పత్రి పూర్తిగా శిథిలమైంది. పెంకులన్నీ రాలిపోయి గోడలు శిథిలావస్థకు చేరాయి. రెండేళ్ల క్రితం కురిసిన భారీ వర్షాలకు దూలాలు, పెంకులు రాలిపోయి సగ భాగం కూలిపోయింది. దీంతో ఏ మాత్రం వర్షం కురిసినా మందులు, రికార్డులు తడిచిపోయి పాడవుతున్నాయి. పై నుంచి రాలుతున్న పెంకుల వల్ల భవనంలో ఉండి విధులు నిర్వహించడానికి వైద్య సిబ్బంది భయాందోళనకు గురవుతున్నారు. తాజా మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ కృషితో విశాఖ డెయిరీ ఛైర్మన్ ఆడారి ఆనందబాబు ఇక్కడ నూతనంగా పశువుల ఆస్పత్రి నిర్మాణానికి రూ.10 లక్షలు కేటాయించారు. విశాఖ డెయిరీ నిధులతో ప్రస్తుతం పాత పశువుల ఆస్పత్రి పక్కనే కొత్త భవన నిర్మాణం చేపట్టారు. రెండు నెలల క్రితం ఆస్పత్రి నిర్మాణం పూర్తి చేసుకుంది. ఇంతలో ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ప్రారంభోత్సవం చేయలేదు. ప్రస్తుతం వర్షాలు కురవడంతో పాత పశువుల ఆస్పత్రిలోకి వర్షం నీరు చేరి మందులు తడిచిపోయి రైతులు, వైద్య సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. నిర్మాణం పూర్తవడంతో పశువుల ఆస్పత్రిని ప్రారంభోత్సవం చేసి అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

ఆనందంగా ఉంది



వ్యవసాయంతోపాటు పాడి ఆవులను మేపుకుంటూ జీవనం సాగిస్తున్నాను. పాడి ఆవులకు ఏ జబ్బు వచ్చినా వడ్డాది పశువుల ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్య సేవలు చేయిస్తాం. మా చిన్నతనంలో కట్టిన పశువుల ఆస్పత్రి పూర్తిగా శిథిలమైంది. వర్షం కురిస్తే ఆస్పత్రి లోపలకు వెళ్లాలంటే పెంకులు మీద పడతాయని భయభ్రాంతులకు గురవుతున్నాం. కొత్తగా భవనం కట్టిన విశాఖ డెయిరీ యాజమాన్యానికి, మాజీ ఎమ్మెల్యే ధర్మశ్రీకి కృతజ్ఞతలు.. ఇక సిబ్బందికి రైతులుకు ఇబ్బందులు తొలగడం ఆనందంగా ఉంది.
– ఎల్లపు గోవింద, రైతు, విజయరామరాజుపేట

త్వరగా భవనం ప్రారంభించాలి



పశువులు మేపి పాడి ద్వారా ఉపాధి పొందుతున్నాను. వడ్డాది పెద్దేరు నది ఒడ్డున శిథిలమైన ఆస్పత్రి పక్కనే కొత్తగా పశువుల ఆస్పత్రి నిర్మించారు. కొత్త భవనం నిర్మాణం పూర్తయినా ప్రారంభోత్సవం చేయలేదు. పాత భవనంలోనే విధులు నిర్వహిస్తున్నారు. వర్షానికి మందులు తడిచిపోయి అవస్థలు పడుతున్నారు. కొత్త భవనం ప్రారంభిస్తే పలు గ్రామాల రైతుల జీవాలకు పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందుతాయి.
– బుద్ద ఆదినాయుడు, కుముదాంపేట రైతు

ఆర్బీకేల్లో విత్తన రిజిస్ట్రేషన్

ఆర్బీకేలకు చేరుకున్న వరి విత్తనాలు


రైతులతో రిజిస్ట్రేషన్ చేయిస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది


ఎల్. పొన్నవోలులో రిజిస్ట్రేషన్ చేస్తున్న వీహెచ్ఏ శ్రీనివాసరావు


సోమశేఖర్

మాడుగుల రూరల్: అడపాదడపా వర్షాలు కురవడంతోపాటు ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో వరి విత్తనాలు రిజిస్ట్రేషన్ చురుగ్గా సాగుతోంది. ప్రధానంగా ఆర్జీఎల్, సాంబమసూరి, సోనామసూరి, అమర్(1064), మార్టేరు సాంబ (ఎం.టి.యు 1224), ఇంద్ర, (1061), స్వర్ణ వరి విత్తనాల కోసం రైతులు తమ ఆధార్ కార్డు పట్టుకెళ్లి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎం. వాసుదేవరావు సూచించారు. రైతు భరోసా కేంద్రాల్లో గ్రామ వ్యవసాయ సహాయకులు లేదా గ్రామ ఉద్యానవన శాఖ సహాయ సంచాలకులు విత్తనాలు కోసం రిజిస్ట్రేషన్ చేస్తున్నారన్నారు. ఎల్. పొన్నవోలులో వీహెచ్ఏ శ్రీనివాసరావు రిజిస్ట్రేషన్ చేశారు.
కె.కోటపాడు: ఖరీఫ్ సాగులో రైతులకు ప్రభుత్వ సబ్సిడీపై అందించేందుకు వరి విత్తనాలు ఇప్పటికే గ్రామాల్లోని ఆర్బీకేలకు చేరుకున్నాయి. మండలంలో 22 సచివాలయాల పరిధిలోని రైతులు ఎక్కువగా ఏ రకం వరి విత్తనాలు సాగు చేస్తున్నారో.. వాటిని సిద్ధంగా ఉంచారు. వీటి మొలక శాతం పరీక్ష పూర్తి చేశారు. ఇప్పటి వరకూ 22 ఆర్బీకేల్లో ఆర్‌జీఎల్ రకం విత్తనాలు 464 క్వింటాళ్లు, బీపీటీ 5204 రకం 174 క్వింటాళ్లు, బీపీటీ 3291 రకం విత్తనాలు 99 క్వింటాళ్లు, ఎంటీయూ 1121 రకం 464 క్వింటాళ్లు, ఎంటీయూ 1061 రకం 43 క్వింటాళ్లు, ఎంటీయూ 1064 రకం 50 క్వింటాళ్లు, ఎంటీయూ 7029 రకం 27 క్వింటాళ్లు, ఎంటీయూ 1318 రకం 19 క్వింటాళ్లు, ఎంటీయూ 1224 రకం 3 క్వింటాళ్లు అందుబాటులో ఉన్నట్లు మండల వ్యవసాయాధికారి పి.సోమశేఖర్ తెలిపారు. వీటిలో ఆర్జీఎల్ రకం 30 కిలోల బస్తా రూ.954, సాంబమసూరి(బీపీటీ-5204) రకం 25 కిలోల బస్తా రూ.795లు, సోనా మసూరి(బీపీటీ-3291 రకం 30 కిలోల బస్తా రూ.834 రైతులు చెల్లించాలని తెలిపారు. ఈ రకాలకు సంబంధించిన వరి విత్తనాలు కాకుండా మిగిలిన రకాలైన వరి విత్తనాలకు రూ.894 చెల్లించాలని ఏవో తెలిపారు. విత్తనాలకు సచివాలయాల్లో వ్యవసాయశాఖ సహాయకుల ద్వారా రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిర్వహిస్తున్నామని తెలిపారు. రైతులు విత్తనాలను పొందేందుకు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు.


కె.కోటపాడు ఆర్బీకేలో వరి విత్తనాల బస్తాలు

అవినీతి రహిత సమాజ నిర్మాణమే ధ్యేయం

ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక రాష్ట్ర కార్యదర్శి చినకన్నబాబు


మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి చినకన్నబాబు, జిల్లా అధ్యక్షుడు రమణ


నూతనంగా ఎంపికైన పాలకవర్గ సభ్యులు

దేవరాపల్లి: అవినీతి రహిత సమాజ నిర్మాణమే తమ ధ్యేయమని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక రాష్ట్ర కార్యదర్శి చినకన్నబాబు, జిల్లా అధ్యక్షుడు కె.వి.రమణ అన్నారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు కె.వి.రమణ అధ్యక్షతన ఆదివారం దేవరాపల్లిలో మండల కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.త్రినాథరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ జిలానీ, నర్సీపట్నం మండలాధ్యక్షుడు ఎండి.ఎ. అన్వర్, ప్రధాన కార్యదర్శి ఎస్.ఏ.వలి తదితర జిల్లా కమిటీ సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన మండల పాలకవర్గం సభ్యుల ఎంపిక జరిగింది. మండల అధ్యక్షుడిగా పోతల చిన అప్పలనాయుడు, ప్రధాన కార్యదర్శిగా రొంగలి సత్యం, ట్రెజరర్‌గా బడబళ్ల సత్యం, ఉపాధ్యక్షుడిగా డి. వెంకటపతిరాజు, సహాయ కార్యదర్శులుగా రంధి వెంకటరావు, గంగవంశం సంతోష్, గంగవంశం రజనీ, సిహెచ్. పెద్దినాయుడు, గండిపడాల మధులను సభ్యులంతా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం రాష్ట్ర కార్యదర్శి కన్నబాబు, జిల్లా అధ్యక్షుడు రమణ మాట్లాడుతూ భారత రాజ్యాంగం, సమాచార హక్కు చట్టంపై ప్రజలకు, విద్యార్థులకు యువతకు అవగాహన కల్పించాలన్నారు. ప్రజా సమస్యలు పరిష్కారానికి కృషి చేయడంతోపాటు షెడ్యూల్ ప్రకారం గ్రామాలలో సభల నిర్వహణకు కృషి చేయాలని నూతన సభ్యులకు సూచించారు.

పాఠశాలల బలోపేతానికి విద్యా కమిటీలు

మాకవరపాలెం: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు మండల స్థాయిలో విద్యా కమిటీ ఏర్పాటు చేసినట్లు ఎంఈవో మూర్తి తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు విద్యాశాఖ ఆధ్వర్యంలో నేను బడికి పోతా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమం వచ్చే నెల 12వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. బడి ఈడు పిల్లలను పాఠశాలలకు పంపాలని తల్లిదండ్రులకు సూచించారు. కమిటీలో ఛైర్మన్‌గా ఎంపీడీవో, సభ్యులుగా తహసీల్దార్, ఎంఈవో, సీడీపీవో ఉంటారన్నారు.

82 క్వింటాళ్ల వరి విత్తనాలకు ప్రతిపాదన

మాకవరపాలెం: వచ్చే ఖరీఫ్ సీజన్‌కు మండలానికి 82 క్వింటాళ్ల వరి విత్తనాలకు ప్రతిపాదనలు పంపామని ఏవో చిరంజీవి తెలిపారు. మండలంలో 15 రైతు భరోసా కేంద్రాల్లో విత్తనాలను అందుబాటులో ఉంచుతామన్నారు. విత్తనాలు కావాల్సిన రైతులు రైతు భరోసా కేంద్రాల్లో ముందస్తుగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. కేజీ వరి విత్తనాలకు రూ.5 రాయితీ ఉంటుందన్నారు.

వేడుకగా మాలధారణ భక్తుల ఇరుముడులు


ఇరుముడులు కట్టుకుంటున్న మాలధారణ భక్తులు

మాడుగుల రూరల్: కె.జె.పురం మోదమాంబ ఆలయంలో మోదమాంబ మాలధారణ భక్తులు ఆదివారం ఇరుముడులు ధరించారు. ఇక్కడ నుంచి మాడుగుల మోదమాంబ ఆలయానికి బయలుదేరారు. గ్రామంలో సుమారు 30 మంది భక్తులు మాలధారణ చేశారు. వీరికి గురు మాత, చావలి శ్రీనివాసశర్మ ఇరుముడులు కట్టారు.

ఘనంగా నవదుర్గ ఆలయ వార్షికోత్సవం

రాంబిల్లి: మండలంలోని కట్టుబోలు గ్రామంలో ఆదివారం నవదుర్గ అమ్మవారి ఆలయ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు . మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు. కట్టుబోలు తదితర గ్రామాల నుంచి భక్తులు అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

విలువలతో కూడిన విద్య లక్ష్యం


రోబోటిక్స్‌పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం


సూపర్ - 60 కార్యక్రమానికి హాజరైన విద్యార్థులతో సంస్థ సిబ్బంది

మాడుగుల రూరల్: సూపర్ - 60 కార్యక్రమం ద్వారా 9, 10 తరగతుల విద్యార్థులు నైపుణ్యాలు, విలువలతో కూడిన విద్యనభ్యసించాలని సృజనవాణి స్వచ్ఛంద సంస్థ సమన్వయకర్త కె. జానీ పేర్కొన్నారు. వీరవల్లి అగ్రహారం వద్ద సృజనవాణి సంస్థ కార్యాలయంలో ఆదివారం సూపర్ -60 కార్యక్రమంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సంస్థ రెండు సంవత్సరాలుగా 9, 10, విద్యార్థులకు నైపుణ్యాలు, విలువలతో కూడిన విద్యను అందించాలనే ఉద్దేశంతో ఏడాదికి 40 రోజులపాటు రెసిడెన్షియల్ పద్ధతిలో శిక్షణ ఇస్తున్నామన్నారు. ఇందులో భాగంగా ప్రతి నెలా రెండో శని, ఆదివారాలతో పాటు సంక్రాంతి, దసరా, వేసవి సెలవుల్లో శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈ సందర్భంగా సిరి ఫౌండేషన్ సహకారంతో రోబోటిక్స్‌పైన తేజేశ్వ, దయా అవగాహన కల్పించారు. విద్యార్థులతో కొన్ని మోడల్స్ తయారు చేయించారు. కార్యక్రమంలో సిరి ఫౌండేషన్ ప్రతినిధులు విష్ణు, బాబూరావు, నారాయణ, సంస్థ సమన్వయకర్త రాపేట రామారావు, సభ్యులు పాల్గొన్నారు.

టెన్త్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు సత్కారం


విద్యార్థులను సత్కరించి స్కాలర్‌షిప్‌లు అందిస్తున్న మలసాల భరత్‌కుమార్, వేపాడ చిరంజీవిరావు

తుమ్మపాల: ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాలను చేరాలంటే పదవ తరగతి తొలి మెట్టు అని, అందుకే మంచి ఫలితాలు సాధించేందుకు పట్టుదలతో చదవాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ అన్నారు. పట్టణంలోని జీవీఆర్ రెసిడెన్సీలో జిల్లా తూర్పు కాపు టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తాజా టెన్త్ ఫలితాల్లో 550 మార్కులు, ఆ పైన వచ్చిన విద్యార్థులకు ఆదివారం నిర్వహించిన ప్రతిభ పురస్కారాలు, స్కాలర్‌షిప్‌ల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, మలసాల భరత్‌కుమార్ విచ్చేసి విద్యార్థులను అభినందించారు. విద్యార్థులు లక్ష్య సాధనలో ఎలాంటి సాయం కావాలన్నా తనను సంప్రదించాలన్నారు. ఎమ్మెల్సీ చిరంజీవి మాట్లాడుతూ విద్య ఆవశ్యకత, చదువులో ప్రతిభకు చేయాల్సిన సాధన, ప్రస్తుత విద్యా విధానంలో వచ్చిన మార్పులకు అనుగుణంగా విద్యార్థుల సంసిద్ధతపై సూచనలిచ్చారు. విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ సేవా భావం కలిగి ఉండాలన్నారు. తూర్పు కాపు సంఘ అధ్యక్షుడు పలకా రాము, ఉషోదయ సంస్థల అధినేత రమణాజీ, సరస్వతి విద్యా సంస్థల అధినేత సుంకర శ్రీనివాసరావు పాల్గొన్నారు.

40 మంది రక్తదానం


రక్తదానం చేస్తున్న యువకులు

తుమ్మపాల: ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడం వల్ల, మరొకరికి ప్రాణదానం చేసినవారవడంతోపాటు, ఆరోగ్యం కూడా సిద్ధిస్తుందని డాక్టర్ వైడీఎస్ మూర్తి అన్నారు. పట్టణంలోని లోటస్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో ఫాదర్స్ డే సందర్భంగా శ్రీ గౌరీ గ్రంథాలయంలో ఏఎస్ రాజా బ్లడ్ బ్యాంక్ సహకారంతో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. శిబిరాన్ని ఆయనతో పాటు ఎస్‌డీ గ్రూప్స్ అధినేత కాండ్రేగుల శ్రీరామ్, గ్రంథాలయం ప్రతినిధులు కాండ్రేగుల వెంకటరమణ, మల్ల బాపునాయుడు ప్రారంభించారు. రక్తదాతలకు ప్రశంసా పత్రాలు అందించారు. కార్యక్రమంలో విల్లూరి రాజేష్, కాండ్రేగుల జగన్నాథరావు, మారిశెట్టి భాస్కరరావు, వేదరి సంతోష్, కోరుబిల్లి రేవంత్, ఆళ్ల ప్రభాత్, కర్రి గంగాధర్‌తో సహా 40 మంది రక్తదానం చేశారు.

వైభవంగా కల్యాణ వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాలు


స్వామివారికి క్షీరాభిషేకం చేస్తున్న అర్చకుడు సుదర్శనాచార్యులు


స్వామివారి నవకలశ పూజలో భక్తులు


పుట్టమన్ను తీసుకొస్తున్న ఆలయ ధర్మకర్త రామకొండలరావు

మాడుగుల రూరల్: కె.జె.పురం జంక్షన్‌లో కల్యాణ వేంకటేశ్వర స్వామివారి కల్యాణోత్సవాలు ఆదివారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం అంకురార్పణ, విశ్వక్షేణపూజ, అనంతరం పుట్టమట్టి తేవడం, నవకలశస్నపనం(నిజరూపదర్శనం), అనంతరం పుణ్యాహవచనం, రక్షాబంధనం, వాస్తుమండపం, పూజలతో ఉత్సవాలు ప్రారంభించారు. ఆలయంలో స్వామివారికి క్షీర, జలాభిషేకాలు చేశారు. అనంతరం స్వామివారిని అలంకరించారు. ఈ కార్యక్రమంలో అర్చకుడు సుదర్శనాచార్యులు, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త రాపేట రామకొండలరావు, ఉపాధ్యక్షుడు కాళ్ల అప్పలనాయుడు, కోశాధికారి పుట్టా బలరామూర్తి, సభ్యులు యల్లపు రాము, రాపేట బాబూరావు, భక్తులు పాల్గొన్నారు.

నేడు స్వామి వారి కల్యాణోత్సవం

వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం సోమవారం ఉదయం నిర్వహించనున్నారు. అంతకు ముందు ఎదురు సన్నాహ కార్యక్రమం జరుగుతుందని ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, సభ్యులు పేర్కొన్నారు. కల్యాణంలో ఆరుగురు దంపతులు పాల్గొంటారని తెలిపారు. అనంతరం ఆలయం వద్ద అన్నసమారాధన, హిందూ సమ్మేళనం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారని వివరించారు. ఈ నెల 19న స్వామివారి తిరువీధి ఉత్సవం, 22న నాగవల్లి సంబరాలుతో ఉత్సవాలు ముగిస్తాయన్నారు.

అపరాల సాగుకు వరుణుడి దెబ్బ


వడ్డిపలో నీటిలో పెసర పంట

రోలుగుంట: మండలంలో రెండు రోజులుగా కురిసిన వర్షాలతో అపరాల పంట దెబ్బతింటోంది. పూత దశలో ఉన్న పెసర, మినుము పంటలు కుళ్లిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత నెలలో వాతావరణం అనుకూలంగా ఉండడంతో స్వల్పకాలిక రకాలైన మినుము, పెసర, బొబ్బర తదితర అపరాల పంటలను అర్జసరం, శరభవరం, పాపంపేట, రోలుగుంట, వడ్డిప తదితర గ్రామాల్లో విస్తారంగా సాగు చేపట్టారు. పంటలు పచ్చగానే పూత దశలో ఉన్నాయి. అయితే గత వారం ఎండల తీవ్రతకు పంటలు వడలి పోగా గురు, శుక్రవారాలు కురిసిన భారీ వర్షాలకు తేరుకున్నా... భూమి ఇవకెత్తడంతో కుళ్లిపోతాయేమోనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై మండల వ్యవసాయాధికారి ఎస్.విజయలక్ష్మి మాట్లాడుతూ పంట భూమిలో నీటిని వెంటనే పైకిపోయే మార్గం చేసుకుని సంరక్షించుకోవాలని సూచించారు.